# రూ.137.85 కోట్లతో రక్షణ గోడ!

## జ్యుడిషియల్ ప్రివ్యూకు టెండర్లు

ఈనాడు, అమరావతి

కృష్ణా నది వరదల నుంచి విజయవాడ నగరాన్ని రక్షించేందుకు మూడో దశ వరద రక్షణ గోడ నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలన అనుమతి మంజూరు చేసింది. రూ.137.85కోట్ల అంచనా వ్యయంతో జలవనరుల శాఖ పంపిన ప్రతిపాదనలు ఆమోదించింది. విజయవాడ నగరాన్ని తరచూ కృష్ణా నది వరదలు ముంచెత్తుతున్న విషయం తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో రక్షణగోడ నిర్మాణం ప్రారంభించారు. యనమలకుదురు నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు మొత్తం 7 కిలోమీటర్ల వరకు నిర్మాణం చేయాలని నిర్ణయించారు. దీనిలో 2017లో మొదటి దశలో 2.50 కిలోమీటర్లు యనమలకుదురు నుంచి రామలింగేశ్వర నగర్ వరకు మంజూరు చేశారు. మొత్తం 2.5 కిలోమీటర్ల దూరం రూ.165 కోట్లతో నిర్మాణం చేశారు. రెండో దశ రక్షణగోడ నిర్మాణం 2020లో ప్రారంభించారు. రెండోదశలో 1.25 కిలోమీటర్ల దూరం రామలింగేశర్‌నగర్ నుంచి వారధి వరకు నిర్మాణం చేశారు. దీనికి రూ.125 కోట్లను మంజూరు చేశారు. దీని శంకుస్థాపనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడోదశకూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆమేరు జలవనరుల శాఖ రూ.138.80కోట్లకు అంచనాలు ప్రతిపాదిస్తే.. రూ.137.85 కోట్లకు పరిపాలన అనుమతి మంజూరు చేస్తూ జీవో 1844 ను విడుదల చేసింది. కనకదుర్గ వారధి నుంచి పద్మావతి ఘాట్(పీఎన్‌బీ బస్టేషన్) వరకు సుమారు 2.20 కిలోమీటర్లు దూరం ఉంటుంది. దీని నిర్మాణానికి టెండర్లను పిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియలో భాగరంగా జ్యుడిషయల్ ప్రివ్యూ కమిటీకి నివేదించినట్లు జలవనరుల శాఖ ఎస్ఈ ఎస్.తిరుమలరావు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలు జలవనరుల శాఖ, జుడీషియల్ ప్రివ్యూ కమిటీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్నాయని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే.13వతేదీ లోగా తెలపాలని సీఈ నారాయణరెడ్డి కోరారు.

Scanned with OKEN Scanner